
కథ

# అలకగది

పాలకోడేటి కృష్ణమూర్తి

సమయం సాయంత్రం. ఆరోజు మామూలుగానే ఆఫీసు పని ముగించుకొని ఇంటికి చేరాను. ఇంటికి రావడంతోనే ఇంటి ముందు ఇరుగుపొరుగు ఓ పదిమంది దాకా గుంపుగా చేరి లోపలకి కుతూహలంగా చూడడం కనపడింది. నన్ను చూడగానే-



'అదిగో శంకరంగారు వచ్చేశారు' అన్నారు గుంపులోని ఓ గోవిందం.

''ఏమిటండీ ఏం జరిగింది? మీ ఇంట్లో ఎవరి కన్నా అస్వస్థతగా వుందా? లేక-'' అంటూ అర్ధోక్తిలో ఆగిపోయాడు మరో గోపాలం.

''పాపం ఆంటీ ఎలా ఏడుస్తోందో'' అంది ఒకా విడ రాని కన్నీళ్లను తన పక్కనున్నావిడ పమిట చెంగుతో వత్తుకుంటూ..

ఇదంతా చూస్తూంటే నాకు ఆశ్చర్యం కలిగింది. పొద్దున్న నేను ఆఫీసుకి వెళ్లేటప్పుడు అంతా బాగానే వుంది. ఇంతలోనే ఏమయ్యిందబ్బా. నాలోనూ ఆదుర్దా హెచ్చింది. వెంటనే అందరినీ తోసుకుంటూ ఇంట్లోకి వెళ్లాను. లోపల వున్న దృశ్యాన్ని చూసి నిజంగానే నాకు మతిపోయినంత పనయ్యింది. మా శ్రీమతి, సుపుత్రుడు, సుపుత్రిక ముగ్గురూ కలిసి మహా తన్మయత్వంతో టీవీ చూస్తు న్నారు. వాళ్లకి బాహ్య ప్రపంచంలో ఏం జరుగు తుందో కూడా తెలియడం లేదు. అంతగా టీవి సీరి యల్‌లో మునిగిపోయారు. సీరియల్‌లో కథానా యకుడి తండ్రి ఎప్పుడు హరీమన్నాడో తెలియదు కాని కాటికి తీసుకెళ్లడానికి ప్రయత్నాలు చేస్తు న్నారు. ఆయనను పాడె మీద వుంచి భార్యాపిల్లలు చుట్టూరా కూర్చొని టీవీమాటిక్‌గా ఏడుస్తున్నారు. టీవిలో ఏడుపుతో పాటు మావాళ్ల సానుభూతి ఏడుపు కూడా బయటకి వినిపిస్తుండడంతో ఏం జరిగిందా అని ఇరుగుపొరుగు వాళ్లు పోగయ్యారని నాకర్థమయ్యింది. ఇదంతా చూస్తుంటే నాకు చిర్రె త్తుకొచ్చింది.

''ఆ టీవీ సీరియల్‌లో కథానాయకుడి తండ్రి పోవడం కాదు. మీరంతా కలిసి నా ప్రాణాలు తీసే ట్టున్నారు. బయట చూడండి. జనం ఎలా గుమి గూడారో, వాళ్లందరూ ఇంట్లో ఎవరో పోయారను కుంటున్నారు. టీవీ చూసేటప్పుడు 'మెగా టర్బో సౌండ్' పెట్టొద్దని మీకు ఎన్నిసార్లు చెప్పాలి? దాని ఎఫెక్ట్ చాలా సహజంగా వుంటుంది. మీరంతా కలి సికట్టుగా సోకాన్నాలు పెడుతున్నారెందుకోనని జనం మన ఇంటి ముందు గుమిగూడారు'' అన్నాను. అంటూనే విసుక్కుంటూ శ్రీమతి చేతి లోంచి రిమోట్ లాక్కుని టీవీ కట్టేశాను. వెంటనే శ్రీమతి గయ్యిమంది.

''మంచి సీరియల్ వస్తుంటే రసపట్టు సీనులో ఈ రసభంగం ఏమిటి?'' అంటూ నాకేసి ఓ నిర్ల క్ష్యపు చూపు చూసి నా చేతుల్లోంచి రిమోట్ లాక్కుని మళ్లీ టివి ఆన్‌చేసింది.

''ఏళ్లొచ్చాయి. కానీ నీకు బుద్ధి జ్ఞానం ఏకో శానా వుండడంలేదు. ముందు ఆ సౌండ్ తగ్గించు. ఇంట్లో రోజూ ఏదో గొడవ. దానికి తగ్గట్టు టీవీ సీరి యళ్ల సంసారాల గొడవలు. మొత్తం మీద మన మాటలూ ఈ గొడవలూ అన్నీ బయటకి వినపడ తూంటే అందరూ నవ్వుకుంటున్నారు'' అంటూ చిరాకుపడుతూ లోపల గదిలోకి వెళ్లిపోయాను.

కొంచెంసేపు రెస్ట్ తీసుకొని స్నానం చేసి మళ్లీ ఫ్రెష్ అయి ఉదయం చదవగా మిగిలిపోయిన పేపరు తిరగేయసాగాను.

ఓ అరగంట తర్వాత-

''వంటయ్యింది'' అంటూ ఒక్క అరుపు వినపడ్డంతో పేపరులోంచి ఈ లోకంలోకి వచ్చిపడ్డాను. శ్రీమతి వాయిస్ ముందు టీవీ వాయిస్ బలాదూర్ అని తెలుసుకో వడానికి నాకు అట్టేకాలం పట్ట లేదు. నేను మాట్లాడలేదు.

''తొందరగా రండి. అవతల 'సంసారంలో చిటపటలు' సీరి యల్ టైమ్ అవుతోంది'' అంటూ మళ్లీ అరిచింది శ్రీమతి.

''బంటీ, పింకీ త్వరగా రావాలి అన్నం చల్లారిపోతోంది'' అంది.


తర్వాత-


''మీరు కాదు కాని నేను తినేస్తు న్నాను. అవతల సీరియల్ టైమ్ అవుతోంది. అన్న శ్రీమతి 'ఏమండీ మీరు రారా? మీకు ఆకలె య్యడం లేదా ఏం? ఏం మింగారు ఆఫీసులో. మీరేం మింగితే నాకేం' కాని మీ ఇష్టం వచ్చినప్పుడు తినండి అన్నం. మీరు తిన్న తర్వాత మిగిలిన అన్నం ఫ్రిజ్‌లో పెట్టండి. రేపు పులిహోర చేస్తాను. మీకు మార్నింగ్ బ్రేక్‌ఫాస్ట్‌కి'' అంది మా శ్రీమతి. అంటూనే తను తినడం పూర్తి చేసి టీవీ ముందు సెటిలయిపోయింది.

ఎందుకొచ్చిన బ్రతుకిది అనిపిం చింది నాకు. నా చిన్నతనంలో రాత్రి ఎనిమిదయ్యేసరికి మేము అమ్మానాన్నలతో కలిసి భోజనం చేసేవాళ్లం. వంటవాడు ఒక్కొక్క రికి ఓ పద్ధతి ప్రకారం వరుసగా భోజనం వడ్డించేవాడు. ముందు నాన్నగారికి, తర్వాత అమ్మగారికి ఆ తర్వాత మా పిల్లలందరికీ వడ్డించేవాడు. మరిప్పటి పరిస్థితే వేరు.

ఆరోజు రాత్రి తలవాల్చానన్న మాటే గాని నాకు నిద్ర పట్టలేదు. ఒకటే ఆలోచనలు. మంచం మీద అటూ ఇటూ దొర్లసాగాను.

నేను ఎల్ఎల్‌బి చేస్తున్నప్పుడు చాలా పెళ్లిళ్లకి అటెండ్ అయ్యాను. పురోహితుల వేదమంత్రాల మధ్య మంగళవాయిద్యాలు మోగుతుం డగా పెళ్లికొడుకు, పెళ్లికూతురు తల మీద జీలకర్ర, బెల్లం వుంచిన ప్పుడల్లా నాక్కూడా అటువంటి అవకాశం ఎప్పు డొస్తుందా అని అనుకుంటుండేవాడ్ని. అనుకోవడ మేంటి? ఆ అవకాశం రానే వచ్చింది. నేను కూడా పెళ్లి కూతురి తల మీద జీలకర్ర, బెల్లం ఉంచానో లేదో మనసంతా గిలిగింతలు పెట్టినట్లయింది. జాక్‌పాట్ కొట్టినంత ఆనందించాను. స్నేహితుల సమక్షంలో బంధువర్గంతో కూర్చొని ఆరోజు ఏం ఆనందించానో నవ్వానో అంతే. ఆ తర్వాత అలా ఆనందించాల్సిన అవసరం కాని నవ్వాల్సిన అవ కాశం గాని నాకు రాలేదు. ఆఖరికి మిగిలినవి కస్సు బుస్సులు, ఈసడింపులు, చీదరింపులు. మా శ్రీమతికి కోపం ఎక్కువ. చిరాకు అధికం. చిరచిర






లుచాలా. దాంతో మా కాపురంలో కిలకిలల కంటే గిరగిరలే ఎక్కువైపోయాయి. అన్నిటికీ ఆవిడ ఇష్టమే నెగ్గాలి. నా మాట వినేవనే లేదు. ఒక ఉదాహరణ. నాకు మీసాలు ఒత్తుగా గుబురుగా వుండేవి. కాలేజీలో చదువుతున్నప్పటి నుంచి వాటిని జాగ్రత్తగా పోషించుకుంటూ వస్తున్నాను. పెళ్లయిన నెలరోజుల లోనూ వాటిని తీసేదాకా నిద్రపోలేదు మా శ్రీమతి. తీయకపోతే వీలు చూసుకుని ఏదో ఓ రోజు రాత్రి పాలల్లో నిద్రమాత్రలు కలిపి నా చేత తాగించి తానే నా మీసాలు కట్ చేస్తానంది. మొదట్లో వారం రోజుల పాటు మీసాలు గుబురుగా వుండడంతో గిలిగింతలు పెడుతున్నాయి అన్న శ్రీమతి ఆ తర్వాత అవే మీసాలు గుచ్చుకుంటున్నాయనే వంకతో వాటిని హరీమనిపించింది. అప్పటి నుంచి ఆమె ఉత్తరం నేను దక్షిణం. ఎప్పుడంటే అప్పుడు ఏదో విషయంలో శ్రీమతి కేకలు పెట్టడం అందుకు ప్రతిగా నేను కూడా అరవడం. ఇదంతా ఓ ప్రహసనంలా మా కాలనీలో ఆనోటా ఈ నోటా పడ్డం. వాళ్లు మమ్మల్ని వింతగా చూడ్డం జరుగుతోంది.

మనం చేసే మంచి చెడుల కర్మఫలం ఈ జన్మలోనే అనుభవించడం అంటే ఇదేనేమో. స్వర్గమో నరకమో ఎవరు చూశారు? అందుకేనేమో...'చేసుకున్న వారికి చేసుకున్నంత'అనిపిస్తూంటుంది అప్పుడప్పుడు. ఆవిడని చేసుకున్నానేమో ఇప్పుడు అనుభవిస్తున్నాను అని సర్దుకుపోవడం అలవాటు చేసుకున్నాను.

ఒకరోజు నేను ఆఫీసు నుంచి ఇంటికి వచ్చేసరికి మతిపోయినంత పనయ్యింది. ఆ రోజు గుమ్మంలో అడుగు పెట్టానో లేదో ఒక పక్క పెద్దగా టేప్‌రికార్డర్ వాయిస్ వినపడసాగింది. మరోపక్క చందనం, అగరబత్తీల వాసనలు గుబాళిస్తున్నాయి. చీర రంగుకి సరిపడే మ్యాచింగ్ గాజులు వేసుకుని నుదుట మ్యాచింగ్ బొట్టు, మెడలో మ్యాచింగ్ హారం, అరచేతులకి గోరింటాకుతో ముక్కుకున్న ముక్కెర చురుకులీనుతుండగా పెళ్లికూతురిలా గుమ్మంలో నిలబడి వుంది శ్రీమతి. నన్ను చూడగానే–

''ఇంత లేటా? లోపలకి రండి. అలా నిలబడిపోయారేంటి? ఎప్పటి నుంచి ఎదురు చూస్తున్నానో తెలుసా? మీకేదీ పట్టదు.'' అంటూ నా చేతులు పట్టుకొని పడగ్గదిలోకి తీసుకువెళ్లింది. నేను మంచం మీద కూర్చోగానే నేను అడ్డుచెపుతున్నా వినకుండా 'ఈ అధికారం కూడా నాకు దూరం చేస్తారా' అంటూ నా బూట్లు విప్పి.. 'ఉండండి టిఫిన్ పట్టుకొస్తాను.' అంటూ వంటింట్లోకి వెళ్లింది. 'ఈ దోశెలు తింటూ వుండండి. టీ రెడీ అవుతోంది' అంటూ ఓ ప్లేటులో దోశెలు తెచ్చి ఇచ్చింది. నేను శ్రీమతి కేసి ఆశ్చర్యంగా చూస్తూ దోశెలు తినసాగాను. 'ఏంటి కొత్తవాళ్లను చూసినట్లు ఆ చూపులు' అంది శ్రీమతి.

''ఆఁ ఏం లేదు'' అంటూ అక్కడ స్టూలుపైన వున్న టీ లాగించేశాను. ఆఫీసు బట్టలు విప్పి లుంగీ కట్టుకొని ఉతికి ఆరేసిన షర్టు వేసుకోబోతుండగా శ్రీమతి ఆ షర్టుని విసిరికొట్టి ''బట్టలు వేసుకోవడంలో కూడా ఇంత అశ్రద్ధ అయితే ఎలా'' అంటూ బీరువాలోంచి ఇస్త్రీ చేసిన షర్టు, పైజమా నాపైకి విసిరేసింది.

శ్రీమతి నుంచి ఇంతటి మర్యాద ఊహించని నేను 'ఏదో విశేషముండే వుంటుంది. ఇప్పుడు ఎన్ని వేలకి టెండరు పెడుతుందో' అన్న ఆలోచనలో పడ్డాను. లేకపోతే పెళ్లయిన తర్వాత ఎప్పుడూ లేని మర్యాద ఈ రోజు ఎందుకు చేస్తున్నట్లో? అని మనసులో అనుకుంటుండగా నా ఆలోచనలకి బ్రేక్ వేస్తూ శ్రీమతి నా దగ్గరగా వచ్చి కూర్చొని–

''నేనో విషయం చెబుతాను. మీరేమీ అనుకోరు కదా?'' అంది.

''ఏంటో చెప్పు'' అన్నాను.

''ఏమీ లేదండీ. ప్రతి వ్యక్తీ తను ఇల్లు కట్టుకోవాలని, ఆ ఇల్లు మంచిగా వుండాలని కోరుకుంటాడు. ఆ కోరిక తీరుతుంది కూడా. ఇల్లు బాగా కట్టారోయ్ అంటూ అందరూ పొగుడ్తారు కూడా. కానీ తర్వాత ఆ ఇంట్లోని భార్యాభర్తలు ఎప్పుడూ కలహాలతో కాపురం చేస్తే ఇల్లు కట్టుకున్నవాళ్లకి ఇల్లు కట్టుకున్నామన్న సంతోషం చల్లారిపోతుంది. అవునా'' అంది.

''అవును. అందుకు మన ఇల్లే మంచి ఉదాహరణ'' అన్నాను.

''అందుకే చెబుతున్నాను. మన ఇంటికి వాస్తు దోషమేమైనా వుందేమో. పెళ్లయిన దగ్గర నుంచి చూస్తున్నాను. ఎప్పుడూ కీచులాటలే తప్ప ఒక్క రోజయినా సుఖంగా బతికిన రోజు లేదు. ఉదయం లేచిన దగ్గర నుంచి మొహం మాడ్చుకుని పనులు చేసుకోవడం, మీకు డైనింగ్ టేబిల్ మీద అన్ని అమర్చిపెట్టడం, పిల్లల్ని స్కూలుకి పంపడం, మళ్లీ సాయంత్రం అందరికీ అన్నీ అందించి పిల్లల్ని నిద్రబుచ్చి అప్రసన్న ముఖాలతో మంచం మీద ఎదురు బొదురుగా పడుకోవడం. ఇవన్నీ చూస్తుంటే మన ఇంటికి వాస్తు దోషం ఉన్నట్టనిపిస్తోందండి. అందుకని మీరేమీ అనుకోనంటే మన ఎదురింటాయనికి ఓ వాస్తు సిద్ధాంతి తెలుసుట. ఆయన రైల్వేలో పని చేస్తాడట. ఖాళీ వున్నప్పుడు ఎవరైనా పిలిస్తే వాళ్ల ఇంట్లో వాస్తు దోషాలేమైనా వుంటే వివరంగా చెబుతారట. రేపు ఆదివారం సెలవు కాబట్టి ఆయన్ని పిల్చుకురండి. మన ఇంటిని ఒకసారి చూపిద్దాం. వాస్తు దోషాలేమైనా వుంటే సరిచేసుకుందాం. అప్పుడైనా మనం దెబ్బలాడుకోకుండా వుంటామేమో చూద్దాం'' అంది శ్రీమతి.

''ఇల్లు కట్టడానికే తడిసిమోపెడయ్యింది. నానాపాట్లు పడ్డాం. మళ్లీ ఇప్పుడు వాస్తు గీస్తూ అంటూ మొదలుపెడితే ఇంకో లకారమో రెండు లకారాలో తీట వదులుతుంది. అవన్నీ ఇప్పుడవసరం లేదు. మన కర్మ ఎలా వుంటే అలాగే నడుస్తుందీ కొంప'' అన్నాను కొద్దిగా చిరాకు ప్రదర్శిస్తూ...

''అది కాదండీ నేనెందుకు చెబుతున్నానో వినండి. కారణం లేకుండా నేనేమీ మాట్లాడనని మీకు తెలుసుగా. ఇవాళ ఉదయం మీరు ఆఫీసుకి వెళ్లగానే గుర్నాథం గారు మీతో పనుందంటూ మన ఇంటికి వచ్చారు, నేను లోపల పనిచేసుకుంటున్నాను. 'డాడీ వున్నారా బాబూ' అంటూ మన బంటీని అడిగారాయన. దానికి బంటి 'డాడీ ఆఫీసుకి వెళ్లారు అంకుల్' అన్నాడు.

''సరే సాయంత్రం రాగానే నేను వచ్చానని చెప్పు బాబూ'' అంటూ ఆయన వెళ్లిపోబోతుంటే మన బంటీ ఆయన వెనకాలే వెళుతూ...

''అంకుల్.... అంకుల్.... డాడీ సాయంత్రం లేటుగా వస్తారు. పొద్దున్న మమ్మీ కోప్పడిందిగా. అందుకని డాడీ రాత్రి లేటుగా వస్తారు'' అన్నాడు.

దాంతో గుర్నాథం గారు నా వైపు అదోలా చూస్తూ కిసుక్కున నవ్వి వెళ్లిపోయారు. నాకు చాలా సిగ్గనిపించి బాధ వేసింది. అంటే మన ప్రవర్తన మన పిల్లల మీద దుష్ప్రభావం చూపుతున్నట్లే కదా! అందుకని ఈ విషయంలో మీరు నా మాట కాదనకుండా కాస్త పండిట్‌జీని రేపు ఆదివారం తీసుకురండి. మన ఇంటికి వాస్తు దోషమేమైనా

వుందేమో అడుగుదాం అంది శ్రీమతి.

'అలాగే తీసుకొస్తాలే' అంటూ ఆ రోజుకిక ఆ సంభాషణకి ఫుల్‌స్టాప్ పెట్టాను.

అనుకున్నట్టుగానే ఆదివారం రానే వచ్చింది. ఆ రోజు ఎందుకో శ్రీమతి చాలా హుషారుగా కనిపించింది. ఉదయం లేవగానే నవ్వు ముఖంతో నాకు పెసరట్టు, ఉప్మా బ్రేక్‌ఫాస్ట్ పెట్టింది. ఆ తర్వాత కాఫీ తాగి స్నానాదికాలు ముగించుకొని మా ఎదురింటాయన ద్వారా వాస్తు సిద్ధాంతికి ఫోన్ చేసి అప్పాయింట్‌మెంట్ తీసుకున్నాం. ఇంటి ప్లాను తీసుకొని వెంటనే రావల్సిందిగా వాస్తు సిద్ధాంతి చెప్పడంతో నేను శ్రీమతి ఆటోలో వారింటికి వెళ్లాం.

ఇల్లు చాలా నీటుగా వుంది. మమ్మల్ని సాదరంగా ఆహ్వానించారాయన. వయస్సు సుమారు యాభై సంవత్సరాలు వుండవచ్చు. గోచీకట్టు పంచెతో దబ్బపండు ఛాయలో వున్నారాయన. నుదుట రుపాయి బిళ్లంత బొట్టు. మెడలో రుద్రాక్ష మాల ధరించారాయన. అప్పుడే పూజ గదిలోంచి వచ్చారేమో మొహం కాంతులీనుతూ ఓ విధమైన తేజస్సు సంతరించుకుంది. మేము కూర్చోగానే ఆయన భార్య కూడా వచ్చి మాకు నమస్కరించి కూల్‌డ్రింకులు మా ముందుంచి ఆయన పక్కనే కూర్చుంది.

నమస్కారం ప్రతినమస్కారాల తర్వాత ఆయన మా ఫామిలీ విషయాలన్నీ అడిగి తెలుసుకున్నారు. మేము తీసుకొచ్చిన ఇంటిప్లాను ముందు పరుచుకొని పరిశీలించసాగారు. ఓ పదినిమిషాల తర్వాత ఓ చిరునవ్వు నవ్వి 'అంతా బాగానే వుంది. దోషం ఏమీ లేదు' అంటూ ఇంటిప్లాను శ్రీమతి కిచ్చేశారు.

''అంటే – దోషం మరెక్కడుంది? మా ఇంట్లో గొడవలకుకారణం ఏమిటి?'' అంది శ్రీమతి.

ఆయన ఒక్క నిమిషం మా వంక తదేకంగా చూసి–

''నేను చెప్పినట్లు చేస్తారా? అలా చేస్తే మీ సంసారం ఎటువంటి కలతలు అరమరికలు లేకుండా సజావుగా సాగుతుంది'' అన్నారు.

''అలాగే మీరు చెప్పినట్లే చేస్తాం'' అంది శ్రీమతి.

''మీ ఇంటికి ఈశాన్య దిశలో అలకగది ఒకటి కట్టించండి. అన్ని ప్రాబ్లమ్స్ సాల్వ్‌అయిపోతాయి'' అన్నాడాయన.

''అలకగదా? ఆ పేరు నేనెప్పుడూ వినలేదే. భోజనాల గది. పడకగది, వంటగది వంటివి విన్నాం కాని అలకగది అన్నది ఎప్పుడూ వినలేదే. చిత్రంగా వుంది మీరు చెప్పేది... అంతే కాదు. ఏ ఇంజనీరు గాని కాంట్రాక్టరు గాని అలకగది ఏర్పాటు చేసుకోండి అని ఎవరికైనా చెప్పడం కూడా మేము వినలేదు. ఇదేదో మీ దగ్గరే వింటున్నాం.'' అంది మా శ్రీమతి. నేనూ ఆ మాటే అన్నాను.

''ఎక్కడో పాత పుస్తకాలలో ఇటువంటి అలకగదుల గురించి చదివినట్లు గుర్తు. ఇదివరకటి మహారాజులు తమ దేవేరుల కోసం కోపగృహాలంటూ ప్రత్యేకంగా గృహాలు ఏర్పాటు చేసేవారట. మీరు చెప్పేది ఆ బాపతేనా ఏం కొంపదీసి'' అన్నాను.


''ఆఁ అదే నేననేది. కొంపదీసి కాదు. కొంపను మార్చి కోప గృహం అంటూ ఒకటి ఏర్పాటు చేసుకోమంటున్నాను. ప్రత్యేకంగా ఒక గృహం కాకపోయినా ఒక అలకగదిలాంటిది కట్టించుకోండి. మీ సమస్యలు తీరిపోతాయి.'' అన్నారు వాస్తు సిద్ధాంతి.

''మా ఇంట్లో వచ్చిన బాధంతా ఒకటేనండి. మేమిద్దరం ఒకరి మీద ఒకరం అప్పుడప్పుడు అరుచుకుంటుంటాం. అవన్నీ బయటకు వినపడి అందరి నోళ్లలోనూ నానుతున్నాం'' అంది శ్రీమతి.

''అందుకేనమ్మా నేను చెప్పేది. అలకగది అంటూ ఒకటి వుంటే మీకు కోపం వచ్చినా ఆయన అలిగినా చప్పున గదిలోకి దూరి తలుపులు వేసుకుని అలగవచ్చు. అలిగితిరా సఖా అని మీరు అలిగితివా సఖీ అని ఆయన కాసేపు ఒకరినొకరు బతిమాలించుకున్న తర్వాత అలకలు తీరి తీరిగ్గా బయటకు రావచ్చు. అప్పుడిక మీ గొడవలు, చిరాకులు, పరాకులు ఎవరికీ తెలియవు. అంతా గప్‌చిప్‌గా అలక గదిలోనే సెటిల్ అయిపోతాయి'' అన్నాడు వాస్తు సిద్ధాంతి.

''కట్టుకున్న దానికి చీర లేదు. ఉంచుకున్నదానికి పట్టుచీర కావాలన్నాట్ట వెనకటికెవడో మీరు చెప్పేది అలా వుంది. అసలు ఇప్పుడు అలకగది అంటూ వేరేగది కట్టాలంటే మాటలా. ఓ లక్షయినా అవుతుంది'' అన్నాను నేను ఈ సంభాషణంతా వింటూ వొళ్లు మండి.

''అలా అనుకుంటే ఎలా గయ్యా. డబ్బులు చూసుకుంటున్నారు కానీ సంసారం గుట్టు సంగతి ఆలోచించరేం. అంతెందుకు? మీరు దశరథమహారాజునే తీసుకోండి. ఆయన ఎంత తెలివి గలవాడంటే ముందుచూపుతో ఓ కోప గృహం నిర్మించాడు. ఎప్పుడైనా ఆయన ముగ్గురి భార్యల్లో ఎవరైనా ఒకరు అలిగినప్పుడు ఆమె కోప గృహంలోకి వెళ్లిపోయేది. దశరథమహారాజు తాను చేస్తున్న పనిని ఆపేసి గబగబా అలకబూనిన భార్యను ఓదార్చడానికి పరిగెత్తేవాడు. అయితే అలకగదిని కైకేయి ఎక్కువగా ఉపయోగించుకుందనుకోండి. అది వేరే సంగతి. శ్రీకృష్ణుడంతటి వాడు కూడా అంతఃపురంలో కోపగృహమంటూ ఒకటి



## రచయితల చిరునామా

**తత్త్వవేత్త**
జి.శ్రీనివాసరెడ్డి
కేరాఫ్ అభిరామ్ థియేటర్,
నంద్యాల.

**కుందేటి కొమ్ము,**
రాచపూటి రమేష్,
10-73, రాయలనగర్,
14వ క్రాస్, ఆర్.సి.రోడ్,
తిరుపతి - 517 501.

**గోవర్ధనం - గోధుమ హల్వా**
ప్రతాప రవిశంకర్,
ఇం.నెం.11-18-36,
రామిరెడ్డిపేట,
నరసరావుపేట-522601.
గుంటూరు జిల్లా.

**విజయనగరం**
ఎస్.డి.వి. అజీజ్,
46/634, బి.పేట,
కర్నూలు - 2.

**అలకగది**
పాలకోడేటి కృష్ణమూర్తి,
ఫ్లాట్ నెంబర్ 65,
కళ్యాణపురి కాలనీ,
సైనిక్‌పురి, సికింద్రాబాద్-94.

ఏర్పాటు చేసుకున్నట్లు కావ్యాలే రాశారు కదా. సత్యభామ అలక ఓ చక్కని కావ్యానికే వస్తువయ్యింది. ఆ రోజుల్లో భర్తలు భార్యల్ని గౌరవించడమే కాదు వాళ్లకొచ్చిన కోపాన్ని కూడా ఆదరంతో చూసేవారు. నా మాట వి॥ మీరు కూడా మీ ఇంట్లో ఓ అలకగదిని ఏర్పాటు చేసుకోండి. మీ చిక్కులన్నీ వీడిపోతాయి'' అన్నాడు వాస్తు సిద్ధాంతి.

వాస్తు సిద్ధాంతి మాటలు వినగానే శ్రీమతి ముఖంలో సంతోషం వెల్లివిరిసింది.

''ఇదేదో బాగుందే'' అంది.

''కొంచెం బాగుండడం కాదమ్మా. చాలా బాగుంటుంది. కోపాలు, అలకలు, చిరాకులు, పరాకులు బ జారులోను రోడ్లపైనా ప్రదర్శించేవి కావు. కాబట్టి ఇళ్లల్లోనే ప్రత్యేకంగా కోపగృహాలు ఏర్పాటు చేసుకుంటే గుట్టుకి గుట్టూ నిలుస్తుంది. సుఖానికి సుఖమూ దక్కుతుంది'' అన్నాడు వాస్తు సిద్ధాంతి.

''నాకో విషయం చెప్పండి. మీరనుకున్నట్టుగానే కోపగది కట్టించాననుకోండి. ఫస్టు తారీఖున నాకు చీరకొనకపోయినా, కొత్తసినిమా రిలీజయిన రోజు సినిమాకి తీసుకెళ్లకపోయినా నేను అలకగదిలోకి వెళ్లిపోతాననుకోండి- ఆయన అవేవీ పట్టించుకోకుండా వుండిపోయారనుకోండి... అప్పుడెలా?'' అడిగింది శ్రీమతి.

''అలా ఎన్నటికీ జరగదమ్మా. అలా జరిగితే నిప్పులో నెయ్యిపోసినట్టవుతుంది. పోట్లాట పొడిగించకుండా మీరు అలకగదిలోకి వెళ్లగానే మీ ఆయన కూడా కుక్కపిల్లలా మీ వెంట వచ్చి అలకమానమని బతిమాలడతాడు. ఇది గ్యారంటీ. ఇంకో ముఖ్యమైన విషయం మీకు తెలియదేమో చెబుతాను వినమ్మా. అలకగది వల్ల మరో ప్రయోజనం ఏంటంటే అలకగదిలో తలుపులు వేసుకొని మీ ఆయన చెవులు పట్టుకున్నా, బస్కీలు తీయించినా, మీ కోమల పాదాల ముందు సాష్టాంగపడినా ఎవరికీ తెలియదు. మీరు ఎంత అరిచినా కేకలు వేసినా మీ ఇంట్లో పనిమనిషి సహితం కనిపెట్టలేదు. అంతేకాదు. మీ పోట్లాటవల్ల మీ పిల్లల మీద ఎటువంటి దుష్ప్రభావాలు పడే అవకాశాలు కూడా వుండవు.'' అన్నాడు వాస్తు సిద్ధాంతి.

వాస్తు సిద్ధాంతి మాటలు విన్న శ్రీమతి ముఖం చాటంతయింది. ఒక నిమిషం తనలో తాను నవ్వుకుంది. వెంటనే తేరుకుంది.

''అంటే... భార్యాభర్తల మధ్య ఏ సమస్యకైనా సమాధానం 'అలకగది' అన్నమాట. భార్యాభర్తల విషయంలో ఏ సమస్య వచ్చినా అలకగదిలో తొలగిపోతుందన్నమాట. ఆ లెక్కన కూడా అలకగది వుంటే ఎంత బాగుంటుంది'' అంది శ్రీమతి కళ్లు తిప్పుతూ...

మేము వాస్తు సిద్ధాంతిగారికి ఓ ఐదు వందల రూపాయలు సమర్పించుకొని బయటకి వచ్చాం.

దారిలో మల్లెపూలు కనిపించగానే ఆటో ఆపింది శ్రీమతి. ''రెండు మూరల మల్లెపూలు తీసుకోండి'' అంది శ్రీమతి. ఇంటికి రాగానే ''ఇదేంటి మల్లెపూలు తీసుకోమంటే సన్నజాజులు తీసుకున్నారు'' అంది శ్రీమతి.

''సన్నజాజులు నాకిష్టం. అవి ఎంతో సుకుమారంగా బాగుంటాయి'' అన్నాను.

''అదిగో అందుకే నాకు ఒళ్లు మండేది. నేనొకటి చెబితే మీరొకటి చేస్తారు. సిద్ధాంతి గారు చెప్పినట్లు అలకగది అంటూ ఒకటుంటే ఇప్పుడు ఎంత బాగుండేది?''

''ఆc చెప్పారులే... బడాయి కబుర్లు. అవన్నీ ఎవరికి తెలియవని. అసలు రెండు గదుల సొంత కొంప వుండడమే మన బోటి మధ్యతరగతి వాళ్లకి గొప్ప. అటువంటిది అందులో మళ్లీ అలకగది కూడానా... అసలు మన పడకగదిలోనే రెండు మంచాలు పట్టవు. మరో గదా. ఎవరైనా వింటే నవ్విపోతారు. మనం మధ్యతరగతి వాళ్లం. ఇల్లు కట్టుకున్నదే చారెడు స్థలంలో. ఆ సంగతి గుర్తుంచుకో'' అన్నాను విసుగ్గా.

''మరి వాస్తు సిద్ధాంతికి ఐదువందలు సమర్పించుకున్నాం కదా. ఏదో ఒకటి చేయాలి కదా?'' అంది శ్రీమతి.

''అలకగదీ లేదు గిలకగదీ లేదు. సంసారం బండిలాంటిది. అది దెబ్బలాటల మీదే పరుగెడుతుంది. మాటల తూటాలు బండికి ఇరుసులాంటివి. అవి వైవాహిక జీవనం సవ్యంగా సాగడానికి గెలుపు సోపానాలు. సంసారాల్లో వచ్చే తగాదాల్లో ఒకరినొకరు తెలుసుకునే సంకల్పం ఇమిడి వుంటుంది. అలాంటి చిన్నా చితకా తగాదాలు, పోట్లాటలు, వివాదాలు, కీచులాటలు, పెంకితనాలు ప్రతి ఇంట్లోనూ వుండేవే. అలా వుంటేనే అందం. నేను ఈ రోజు నుంచి ఓ నిర్ణయం తీసుకున్నాను. సంసారం కడవరకూ సజావుగా సాగాలంటే భార్య పై స్థాయిలో అరుస్తుంటే భర్త అనేవాడు వినడం వరకే పరిమితమవ్వాలి. ఎదురు వాదించకూడదు. భర్తకి కోపం వస్తే భార్య కూడా డిటోగా ప్రవర్తించాలి. దీని వల్ల వైవాహిక జీవితం బ్యాలెన్స్‌డ్‌గా వుంటుంది. అందువల్ల ఈ రోజు నుంచి గొడవలు చేసే విషయం నీకప్పజెప్పి నేను మాత్రం ఓ శ్రోతలా వుండడం శ్రేయస్కరమని నిర్ణయించుకున్నాం. దీని వల్ల మన సంబంధాల్లో శాంతిప్రక్రియ కొనసాగే అవకాశం వుంది'' అన్నాను సౌమ్యంగా.

''అయితే మీకు మీరు సర్దుబాటు చేసుకుంటారన్నమాటే గాని అలకగది కట్టించరన్నమాట. ఎందుకని అంత పట్టుదల మీకు'' అంది శ్రీమతి నన్ను ఓరగా చూస్తూ...

''ఎందుకంటే అలకగది క్రెడిట్ కార్డు లాంటిది. చేతిలో క్రెడిట్ కార్డు వుంటే అవసరాలు పెరుగుతాయి. ఆలోచనలు తరుగుతాయి. బ్యాలెన్సు తప్పిపోతుంది. ఆనక అప్పులు నిప్పులు. అది తీర్చలేక తిప్పలు మిగులుతాయి. అలకగది విషయమూ అంతే. అలకగదిలో దూరి కైకేయి అడ్డమైన వరాలు కోరుకోబట్టే కదా రాముడు అడవుల పాలైంది. సత్యభామ కోపగృహంలో చేసిన తాండవం వల్లే కదా శ్రీకృష్ణపరమాత్మ అమరావతిపై దండెత్తడానికి కారణమైంది. ఆ సంగతులన్నీ మనకెందుకు గాని అసలు సంసారంలో కాసిని చిటపటలుంటేనే అందం. టపాకాయల పేలుడు లేకపోతే దీపావళి పండగ ఏమంత అందంగా వుంటుంది చెప్పు. సంసారాలు కూడా దీపావళి పండగల్లాంటివే. ముందుచిరాకుల చిటపటలు, ఆ తర్వాత మతాబుల నవ్వుల వెలుగులు'' అన్నాను.

శ్రీమతికి ఏమర్థమయిందో కాని ముసిముసి నవ్వులు నవ్వుకోసాగింది.

★